


**ఒంటి**నిండా నగలతో, బరువెక్కిన శరీరంతో, వయసైపోయినా వదలని వగలుతో ఆ గది తలుపు తెరచి అదోలా నవ్వుతూ లోపలకు వెళ్ళమన్నట్లుగా సంజ్ఞ చేసింది .... ఆమె.... నవ్వినప్పుడు కారాకిళ్ళీ నమిలే నోరు తమాషాగా ముడుచుకుంది....

అతను లోపలకు వెళ్ళాడు .... వెంటనే తలుపుమూసుకుంది....

ఒక్క.క్షణం అక్కడే నిలబడి గదిలోకి చూశాడు అతను....

అంతవరకూ మంచంమీద కూర్చొని ఉన్న 'ఆమె' లేచి నిలబడి అతని దగ్గరకు వచ్చింది.

"రండి...." అతని చేయిని పట్టుకొని అందామె....

అతను ముందుకు కదిలాడు....

"కూర్చోండి...."

అతను అక్కడున్న పేముకుర్చీలో కూర్చున్నాడు....

"ఇదేమిటి?"

ఏమిటన్నట్లుగా ఆమెవైపు చూశాడు అతను..

"....ఇక్కడకొచ్చిన వారెవ్వరూ కుర్చీలో కూర్చోరు .... నేరుగా నన్ను మంచం మీదకు త్రోసేసి నామీదపడి వలువల్ని వలిచేసి నన్ను

నలిపేస్తారు....''

అతనేమీ మాట్లాడలేదు....

''మీరు ఎంచుకోలేదా?''

''అంటే?''

''తినిపారేసే విస్తరాకుల్ని, మాలాంటివాళ్ళను-ఎంచుకొనే తీసుకుంటారు అందరూ....నాలాంటి వాళ్ళనందర్నీ వరుసగా నుంచోబెట్టి నచ్చిన వాళ్ళను ఎంచుకొని అప్పుడు గదిలోకి తీసుకెళ్తారు.... మీరలా చేయలేదేం?''

అతను ఆమె ముఖంవైపు చూస్తూ.... ''చక్కగా ఉండి బాగా మాట్లాడే అమ్మాయి కావాలి అన్నాను'' అన్నాడు....

''అయితే ఎక్కువే తీసుకొని ఉంటుందే?''

అతను గాఢంగా ఊపిరిపీల్చి వదిలాడు....

''నేను చక్కగా ఉన్నానా?''

''ఆఁ....''

''నా కంఠం బాగుందా? నేను బాగా మాట్లాడుతున్నానా?.... అయినా శరీరం, దాని సౌష్టవం బాగుండాలి గానీ మాటలెందుకు మీకు? మనశ్శాంతిలాంటిదేమైనా కావాలా?''

''చెప్తాను.... అలా కూర్చోండి....''

''నువ్వు అనండి చాలు....నాలాంటి వాళ్ళకు బహువచన ప్రయోగం ఎందుకులెండి'' అని ఆమె మంచంమీద కూర్చుంది....

పెద్దవాళ్ళతో, మంచివాళ్ళతో, కొత్తగా పరిచయం అయినవాళ్ళతో ఏకవచన ప్రయోగం చేసి మాట్లాడను నేను....''

''అడుగుతున్నానని ఏమీ అనుకోకండి.... మీకు పాతికేళ్ళుంటాయా?''

''ఇరవై ఎనిమిదేళ్ళు....''

''అయితే నేను మీకంటే చిన్నదాన్నే. ఇక పోతే నన్ను మంచిది అని ఎవరూ అనరు! అఫ్‌కోర్స్, నన్ను నేనే అనుకోననుకోండి.... అయితే నేనే మీకు క్రొత్తగా పరిచయం అయిందాన్నన్న మాట.... క్రొత్తగా పరిచయం అయిన నన్ను ఏకవచనంతో పిలువరు గానీ....'' ఆమె ఆగి అతని కళ్ళల్లోకి ఒక్క క్షణం చూసి.... ''అనుభవిస్తారు కదూ?.... అని అంది....

''మీరు పొరబడుతున్నారు .... నేనందుకు రాలేదు....''

ఆమె ఆశ్చర్యంగా చూసింది అతనివైపు....

''ఇంట్లోకి దొంగవచ్చి నేను వచ్చింది దొంగతనానికి కాదన్నాడట .... అలా ఉంది మీ మాట''

''ఇంట్లోకి వచ్చిన ప్రతివారూ దొంగేనంటారా?''

''కాకపోవచ్చు....కానీ ఈ ఇంట్లోకి వచ్చిన ప్రతివారూ వచ్చేది అందుకే.''

''కావచ్చు....కానీ నేనందుకు రాలేదు....''

''మరెందుకొచ్చారు?''

''చెప్తాను....మీ పేరేమిటి?''

''సుమతి....మతిలేక పెట్టారు నా తల్లిదండ్రులు.... ఇక్కడ చాలామంది పేర్లు మార్చారు గానీ నా పేరు బాగుందట, అందుకని మార్చలేదు....''

''మీ పేరు లాగే మీరూ బాగున్నారు....''

''మంచిదాన్నని ఎవరూ అనలేదుగానీ బాగున్నానని నాతో ఇప్పటికి చాలామందన్నారు....''

''ఎన్నేళ్ళయ్యింది ఇక్కడికొచ్చి?''

''వచ్చింది ఇంటర్వ్యూ చేయడానికా? మీరు కొనుక్కున్న టైమ్‌ని వేస్ట్ చేస్తున్నారు....''

''లేదు.... నా పేరు చక్రవర్తి....పత్రికల్లో కథలు వ్రాస్తుంటాను....''

హఠాత్తుగా ఆమె నవ్వింది....

''ఓ, అదా కథ? ఇప్పటికి ఎన్ని కథలు వ్రాసారు?''

''కొద్దిగా....''

''అచ్చయ్యాయా? ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి....ప్రతిరాయీ దైవ విగ్రహంగా మలచబడదు....ప్రతిపువ్వూ దేవుని పాదాల దగ్గరకు చేరుకోదు.... ప్రతి జీవితం అర్థవంతంగా సాగదు.... అలాగే వ్రాసిన ప్రతి కథా అచ్చు కాదుకదా, అందుకే అడుగుతున్నాను...''

''మీరు బాగా మాట్లాడతారు....''

''ఈ మాటలు అవకాశం వస్తే అందరూ మాట్లాడతారు....మీరు బాగా మాట్లాడే అమ్మాయి కావాలన్నారుగా. బాగా మాట్లాడకపోతే నా యజమాని ఒప్పుకోదు....మీకంటే ముందువచ్చి నాకు చెప్పివెళ్ళింది బాగా మాట్లాడమని .... ఇప్పుడు నా జీవితం గురించి అడిగి కథ వ్రాస్తారా?''

''ఆ ఉద్దేశంతోనే వచ్చాను....''

''నాలాంటి వాళ్ళను గురించి కథలు, నవలలు, సినిమాలు చాలా వచ్చాయి ... ఇంకా మీరేం వ్రాస్తారు?

''ఆలోచనలకు అనుభవం తోడైనప్పుడు, అనుభవంలోంచి ఆలోచనలు వచ్చినప్పుడు మంచి కథలు తయారౌతాయి.... ఒక్కొక్కరి ఆలోచనలు, అనుభవాలు, వేరువేరుగా, ఒక్కోసారి వింతగా ఉంటాయి....నా ఆలోచనలకు అనుభవం కావాలొచ్చి మీ దగ్గరకు వచ్చాను.. మీరు చెప్తే మీ అనుభవాలకు నా ఆలోచనలకు జోడించి కథ వ్రాస్తాను....ఎన్ని కథలు వచ్చినా వ్రాయడానికి ఇంకా మిగిలే ఉంటాయి.... మీలాంటి వాళ్ళ జీవితం గురించి నేను ఇప్పటికి నాలుగైదు కథలు వ్రాసాను .... ఇంకా ఈ సబ్జెక్ట్‌మీద వ్రాయాలని ఉంది....''

నా దగ్గరకు ఇప్పటికి మీరు కాక ఇద్దరు రచయితలు వచ్చారు....''

''ఎవరు వాళ్ళు....?

''ఓ సంవత్సరం క్రితం ఒకాయన వచ్చి నా గతాన్ని అడిగాడు.....ఎందుకు అని నేనడిగితే కథ వ్రాస్తాను అని అన్నాడు .... నేనతని పేరేమిటని అడిగాను.... 'క్రాంతి' అన్నాడు.... 'క్రాంతి' అంటే అర్థం ఏమిటని అడిగాను....''

''ఏమని చెప్పాడు...?''

''ముందు తడబడి, తర్వాత హడావుడిగా గడబిడపడ్డాడు. ఆఖర్న ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు .... క్రాంతి అంటే సూర్యుడు నడిచే మార్గమని చెప్పాను....అందుకతను సిగ్గుపడి తర్వాత నామీదపడి నన్ను కోపంగా నలిపేసి గిల్లేసి పశువులా ప్రవర్తించి వెళ్ళిపోయాడు.... శారీరకంగా నేనప్పుడు ఎంత బాధపడినా, ఆయన వెళ్ళిపోయేటప్పుడు నేను నవ్విన నవ్వు ఆయన్ని తన జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది....కదూ?''

అవునన్నట్లు తలూపాడు చక్రవర్తి....

''తర్వాత రెండు నెలల క్రితమే ఒకాయన వచ్చాడు....రచయితనని తనే చెప్పాడు.... నా జీవితం చెప్పమంటారా అంటే ఆయన వద్దన్నాడు. తను చెప్పిన రీతిలో నన్ను ఉండమన్నాడు.... ఏదో శృంగారం కథ వ్రాస్తాడట. అతను.... తెల్లార్లూ ఏవేవో చేసి వెళ్ళిపోయాడు గానీ అప్పుడప్పుడు నేను పడిన బాధను, ఆ

## కోరుకొండ సత్యానంద్

బాధకు నా కళ్ళవెంట వచ్చిన కన్నీళ్ళను అత నసలు గమనించనేలేదు....''

గాఢంగా నిట్టూర్చాడు చక్రవర్తి....

''నేనలాంటి వాణ్ణి కాదు....''

''మిమ్మల్ని చూస్తుంటేనే తెలుస్తుంది....''

''అయితే మీ గురించి చెప్పండి....''

''చెప్తాను....నేను రచయిత్రినికాదు కాబట్టి కథలా చెప్పలేను....పొడిపొడిగా చెప్తాను...''

''అలాగే చెప్పండి చాలు....''

''....మాది మధ్యతరగతి కుటుంబం....మా ఇంటికి నేనే పెద్దదాన్ని....నాన్నగారు స్కూల్ మాస్టారుగా రిటైరయ్యారు .... రిటైర్ అయిన సంవత్సరానికి కానీ డబ్బు చేతి కందలేదు.... వచ్చిన డబ్బు ఉన్న అప్పులకి సరిపోయింది...

నేను, నా తమ్ముడు, చెల్లెలు ఆయన బాధ్యత లుగా మిగిలిపోయాం.... నా వయసు వాళ్ళ గుండెలమీద కుంపటే అయింది....అందుకే వాళ్ళకు సహాయం చేయలేకపోయినా, నేను బరువుగా ఉండకూడదన్న ఉద్దేశంతో నా వాళ్ళను వాళ్ళ కష్టాలకు వదిలేసి రాజుతో ప్రయాణమైపోయాను....''

''రాజు....అతనెవరు?''

''నన్ను ప్రేమించానని అన్న మనిషి.... సంస్కారం, నిజం ఉన్నట్లనిపించే అతని మత్తు మాటలే నన్నాపని చేసేలా చేసాయి.... బాధ్యతను తగ్గించాలన్న నా ఉద్దేశం నా వాళ్ళకు ఆ బాధ్యతకంటే ఘోరమైన, బాధనే మిగులు స్తుందని అప్పుడు నేనాలోచించలేదు....నేనైనా సుఖపడతానన్న ఆశ నన్ను చూసి గేలిచేసింది. నా బ్రతుకును ఇలా మార్చివేసింది....''

''అంటే....''

''ఏముంది? నా రాజు నన్ను ఇందాక మిమ్మల్ని లోపలకు పంపినావిడ దగ్గర్నుండి నాలుగువేలు తీసుకొని ఈ నరకంలో పడే సాడు....''

''చాలా ఘోరం!''

''అవును... కానీ వాడికి చాలా లాభం, అందుకే ఆపని చేసాడు....''

''అలాంటివాడ్ని ముక్కలు ముక్కలుగా నరికెయ్యాలి!....'' ఆవేశంగా అన్నాడు చక్రవర్తి...

''అవును....ఆపని ఎవరుచేస్తారు?''

ఒక నిముషం ఇద్దరిమధ్యా నిశ్శబ్దం....

''మీ రిక్కడికొచ్చి ఎంతకాలమయ్యింది?''

''ఒక సంవత్సరం...''

''అయితే ఇక్కడ్నుంచి పారిపోవడానికి ప్రయత్నాలేమీ చేయలేదా?''

''నా ప్రతి ఆలోచనా ఆప్రయత్నం గురించే! కానీ ఎలాంటి ప్రయత్నమూ ఇక్కడ సఫలీకృతం కాదు....''

''ఎందుకని?''

''గట్టి కట్టుదిట్టాలు ఎవర్నీ ఈ కంచుకోట నుండి బయటపడనివ్వవు.... ఎలాంటి సమాచారం బయటికి అందదు....''

''పోనీ ఇక్కడకు వచ్చిన వాళ్ళెవ్వరూ మిమ్మల్ని తీసుకొని వెళ్తాననలేదా?''

''కొందరన్నారు: తీసుకెళ్ళి ఉంచుకుంటానని....నేను మరో స్త్రీ కన్నీటికి కారణాన్ని కాకూడదనే ఉద్దేశంతో నేను వెళ్ళలేదు....చాలా కొద్దిమంది తీసుకెళ్ళి పెళ్ళి చేసుకుంటానని అన్నారు.... ఆవేశం చల్లారిపోయాక చల్లగా వెళ్ళిపోయారేగానీ ఎవ్వరూ మళ్ళీ కన్పించలేదు. క్రొత్తలో, వచ్చినవాళ్ళు అన్న మాటలకు నా మనసు రెపరెపలాడేది గానీ ఇప్పుడది చలించడం, ఆలోచించడం, ఆశపడ్డం, రెపరెపలాడ్డం అన్నింటినీ మరచిపోయింది....''

''ఇంత విశాలమైన ప్రపంచంలో ఒక్కరు.. ఒక్కరంటే ఒక్కరు మీకు చేయూతనివ్వలేక పోయారు ఇలాటి పరిస్థితులు కన్పించినప్పుడే రచయిత గుండెలు రగిలిపోతాయి, వాళ్ళ మనసులు కుమిలిపోతాయి''

సుమతి నవ్వింది చిన్నగా....

### రివర్స్ స్ట్రోక్

''ఓ గంట కాలం పొట్ట రోజూ బాగా గొంతు పెంచి సంగీత సాధన చేసేవారికి ముసలి తనం....గుండె నొప్పి....తల నొప్పి అనేవి రావట....''ఆశ్చర్యంగా అన్నాడు రఘురాం.

''బహుశా....అవన్నీ విన్న వారికి వస్తాయనుకుంటాను''సాలో చనగా అన్నాడు మధూక్.

—బి. వి. యస్. బాబు
తెనాలి.

''మీలోని రచయితకు ఆవేశం వచ్చినట్లుంది....ఆ రచయిత ఆవేశపడేబదులు, మంచి ఆలోచనతో చక్కని కథ వ్రాసేబదులు....ఆ ఆవేశంతో ఆలోచించి, ఆ ఆలోచనకు కార్యరూపాన్ని ఇస్తే ఎంత బాగుంటుందోనని అన్పిస్తుంది....''

''అంతే....?''

''ఏముంది? చేయూతనివ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదని అనే బదులు మీరే ముందుకు వచ్చి చేయూతనివ్వచ్చుగా?''

.........''చక్రవర్తి ఏమీ మాట్లాడలేదు...

''ఏం సమాధానం చెప్పాలో అని ఆలోచిస్తున్నారా? ఆశతో నేనామాట అనలేదు.... మీ ఆవేశం చూసి ఏదో అలా అనేశాను....సారీ.''

''సుమతిగారూ! ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఆలోచన అక్కర్లేదంటారా?''

''మీరేదైనా నిర్ణయం తీసుకున్నారా!''

''అవును....మిమ్మల్ని నేను తీసుకెళ్తాను... మీ భవిష్యత్తుకు బంగారు బాటవేస్తాను....''

''అంటే....ఉంచుకుంటారా?''

''కాదు....''

''పెళ్ళిచేసుకుంటారా?''

''.... చేసుకోలేను, నాకు పెళ్ళయింది కాబట్టి''

''అయితే, తీసుకెళ్ళి నన్నేం చేస్తారు?''

''మీ భవిష్యత్తును తీర్చి దిద్దడానికి ఉంచుకోవడం, పెళ్ళి చేసుకోవడం ఈ రెండేనా మార్గాలు?''

''మరేం చేస్తారు?''

''మీ బ్రతుకు తెరువుకు గౌరవమైన మార్గాన్ని చూస్తాను....మీ జీవితం ఒక పద్ధతిలో పడేవరకూ చేదోడు వాదోడుగా ఉంటాను....

''అందుకు మీ భార్య....''


''తప్పకుండా సహకరిస్తుంది....''

''అయితే ఎప్పుడొస్తారు?''

''రేపే. నా భార్యకు చెప్పివస్తాను....''

''ఆమె కాదంటే?''

''మీకా అనుమానం అక్కర్లేదు....అభ్యుదయ భావాలుగల భార్య నాకు దొరికింది...



ఆమె తప్పకుండా ఒప్పుకుంటుంది....''

''అయితే ఓ విషయం మీకు చెప్పాలి....''

''ఏమిటది?''

''ఇక్కడ్నుంచి నన్ను తీసుకెళ్ళాలని మీకున్నా, మీతో వచ్చేయాలని నాకున్నా నా యజమానికి పదివేలివ్వాలి మీరు....''

ఉలిక్కిపడ్డాడు చక్రవర్తి....

''పదివేలా? ఎందుకు?''

''కొనుక్కున్న నన్ను ఎవరైనా కావాలంటే లాభానికి అమ్మేస్తాడు....''

''ఇన్నాళ్ళు మీ ద్వారా డబ్బు సంపాదించారుగా?''

''మీరు తీసికెళ్ళిపోతే వచ్చే ఆదాయం పోతుందిగా? అందులోనూ ఇక్కడున్న వాళ్ళలో నేనే ఎక్కువ సంపాదిస్తున్నాను....!

చక్రవర్తికి ఏం మాట్లాడాలో పాలుపోలేదు. ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు''

''అంత డబ్బు మీరు నామీద పెట్టలేరా?''

''ఉంటే అలాగే చేసేవాణ్ని....కానీ నా దగ్గర అంత డబ్బులేదు....అయినా ప్రయత్నిస్తాను.... నా భార్య మెడలో బంగారాన్ని అమ్మేసైనా మిమ్మల్ని తీసుకెళ్తాను....''

''అంత అదృష్టం, ఆ అవకాశం నాకు వస్తాయి అనుకోవడం లేదు....అయినా మీరు నా కోసం అనవసరంగా ఇబ్బందుల్లో పడుతున్నారు....''

అలా అనకండి సుమతిగారూ! నేననుకున్నది చేస్తాను....తప్పకుండా చేస్తాను....ఇక వస్తాను'' అని లేచి నిలబడ్డాడు....

''ఎక్కడికి? ఇప్పుడు సమయం ఎంతయ్యిందో తెలుసా?''

చక్రవర్తి గడియారం వైపు చూశాడు....

రెండుంపావు...

''ఇంతరాత్రివేళ ఏం వెళ్తారు? తెల్లవారుఝామునే వెళ్ళిపోదురుగాని....అయినా ఇచ్చిన సొమ్ముకి ఏమాత్రం సుఖం పొందలేదు మీరు..''

''వద్దు....''

''అలా అందేకాదు .... రండి....'' అని చక్రవర్తి మెడచుట్టూ చేతులు వేసింది సుమతి.

''సారీ,''

''నాకోసం నా తృప్తికోసం....నేను మీకు ఇవ్వగలిగింది ఇదేకదా? స్నేహితురాల్ని, వద్దంటే బాధపడతాను....'' అని గట్టిగా పెనవేసుకుపోయింది సుమతి....

చక్రవర్తి కాస్త మెత్తబడ్డాడు.

మరునిముషంలో ఆ గదిలో లైటారిపోయింది!

గడియారం నాలుగు గంటలు కొట్టాక చక్రవర్తికి మెలకువ వచ్చింది .... లేచి లైట్ వేసి బట్టలు వేసుకొని బయల్దేరాడు....

గది తలుపు వరకూ తోడొచ్చింది సుమతి.

''వస్తానండి....''

''ఎదురు చూస్తుంటాను....''

చక్రవర్తి తలుపుతీసి బయటకు వెళ్ళబోతుండే.... ''చిన్నమాట'' అని చేయిపట్టుకుంది సుమతి....

చక్రవర్తి ఆగి సుమతి కళ్ళలోకి చూసాడు.

''ఆలోచన వచ్చిందా.''

''దేనికి?''

''కథ వ్రాయడానికి....''

''కథ వ్రాసేబదులు చేయూతనివ్వమని అన్నారుగా? ఆ పనే చేసాను....''

''మనిషిగా ఆపనీ చేయగూడదా అని అడిగాను....రచయితగా మీరా కథను వ్రాయమని కోరుతున్నాను....''

''అయితే తప్పకుండా వ్రాస్తాను....''


''ఏం వ్రాస్తారు?''

''చెప్పానుగా, కథ అని''

''అందే, అందులో ఏం వ్రాస్తారు?''

''మీ జీవితాన్ని...''

''అయితే చిన్న సలహా మావి ఎవరూ పట్టించుకోని జీవితాలు .... కుళ్ళిపోయేవరకూ మగవాడి సుఖానికి తప్ప ఎందుకూ పనిచెయ్యం మేము.... సమాజంలోనే ఉన్నా మాగురించి పట్టించుకొనేవాళ్ళు ఆలోచించేవాళ్ళు చాలా



తక్కువ....ఆదరించే వాళ్ళు అసలు లేరనే చెప్పాలి....మీలాంటి రచయితలు మా జీవితాన్ని రాస్తేమాత్రం అందరూ చదువుతారు....రచన బాగుందని మిమ్మల్ని పొగుడుతారు....ఇప్పుడు మీరు బరువైన సన్నివేశాల్లో, గుండెల్ని కోసేసే మాటల్లో వ్రాస్తే చదివి ఎందరో కన్నీళ్ళు పెట్టుకుంటారు....కానీ వ్రాసే మీరు, చదివే వాళ్ళు ఆలోచించని విషయం ఒకటుంది...."

"ఏమిటది."

"పరిష్కారం జీవితాన్ని వ్రాసి సమస్యను చూపించే వరకే రచయిత బాధ్యతకాదు....పరిష్కారం కావాలి....మీరైనా ఆలోచించి ఆచరించగలిగే చక్కని పరిష్కారంతో నా జీవితాన్ని వ్రాయండి....అలా వ్రాస్తానంటే మీకు [illegible].... ఎలాగూ నేను కొన్ని రోజుల్లో మీ సిటలోనే ఉంటాను కదా ?

'మీకు చాలా విషయాలు తెలుసు...."

"అవును....అనుభవం తెలియజెప్పిన విషయాలివి...."

'ఇంక నే వస్తాను...."

"మంచిది...."

చక్రవర్తి వెళ్ళిపోయాడు. సుమతి తలుపు వేసుకుంది.

క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు గడిచిపోతున్నాయిగానీ సుమతి దగ్గరకు చక్రవర్తి రాలేదు.

కానీ....

ఆ రోజు రాత్రి వచ్చిన ఒకతను సుమతిని అనుభవించేసి అలసిపోయి వెంటనే నిద్రలోకి జారిపోయాడు....సుమతికి నిద్రరాక అతను తెచ్చిన ఓ పత్రికను అందుకొని పేజీలు త్రిప్ప సాగింది....

ఆ పత్రికలో ఒక పేజీలో చక్రవర్తి ఫోటో ఉంది....దాన్ని సుమతి గుర్తుపట్టింది....

ఆ పత్రికలో 'పరిష్కారం కావాలి' అనే కథ పడింది.... ఆ కథా రచయితగా చక్రవర్తి ఫోటో, పరిచయం అచ్చయ్యాయి.... కానీ కథా రచయిత పేరు 'సుందరం' అని ఉంది....సుమతి మరొకసారి ఆ ఫోటోను పరిశీలనగా చూసింది....

"ఇది ఖచ్చితంగా అతని ఫోటోయే! నాతో పేరు మార్చి చెప్పి ఉంటాడు" అని అనుకుంది.

తర్వాత ఫోటో క్రింద అచ్చయిన అతని పరిచయాన్ని చదవసాగింది సుమతి....

"....చదివింది ఎమ్ కామ్.... ఉద్యోగం చేస్తున్నది విశాఖపట్నంలో బ్యాంకు ఆఫీసరుగా.... మనిషిగా వయసు ముప్పై.... రచయితగా [illegible] నాటికలు.... పరిచయం ఉన్న పాత్రల గురించే కథలు వ్రాయడం అలవాటు.... శ్రీశ్రీ సాహిత్యం అంటే వల్లమాలిన అభిమానం....సమస్య, పరిష్కారం ఉంటేనే అది సంపూర్ణమైన సాహిత్యం అవుతుందని గట్టి నమ్మకం! ఇంకా బ్రహ్మచారినే.... అభ్యుదయ భావాలుకల అమ్మాయిని భార్యగా చేసుకోవాలన్నది నా కోరిక.... నా ఈ 'పరిష్కారం కావాలి' కథకు బహుమతినిచ్చి ప్రోత్సహించిన సంపాదకవర్గానికి నా కృతజ్ఞతలు!

పరిచయం చదవడం పూర్తిచేసి ఆ ఫోటో వైపు చూస్తూ ఉండిపోయింది సుమతి....

సుమతికి ఆ రోజు రాత్రి జరిగిన సంభాషణ గుర్తొచ్చింది....

"అవును....మిమ్మల్ని నేను తీసుకెళ్తాను.... మీ భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాను...."

"అంటే.... ఉంచుకుంటారా ?"

"కాదు...."

"పెళ్ళి చేసుకుంటారా ?"

"చేసుకోలేను, నాకు పెళ్ళయ్యింది కాబట్టి!"

## పొదుపు

పురోహితుని భార్య : ఏమండీ ఈరోజు పెళ్ళిచేసి వచ్చారుగాని సంచిలో బియ్యం చాలా తక్కువున్నాయేంటీ? అని అడిగింది ఆశ్చర్యపోతూ!

పురోహితుడు ; అవునవును చాలా తక్కువే వున్నాయి. పెళ్ళి కూతురూ, పెళ్ళికొడుకు పొదుపు ఉద్యమంలో మెంబర్లట. అందు [illegible] పోసుకున్నారు అన్నాడు.

ఎయం. జనార్థన్

వారాసిగూడ.

"అయితే తీసుకెళ్ళి నన్నేం చేస్తారు."

"మీ భవిష్యత్తును తీర్చి దిద్దడానికి ఉంచుకోవడం, పెళ్ళి చేసుకోవడం ఈ రెండేనా మార్గాలు ?"

"మరేం చేస్తారు ?"

"మీ బ్రతుకుతెరువుకు గౌరవమైన మార్గాన్ని చూస్తాను.... మీ జీవితం ఒక పద్ధతిలో పడే వరకూ చేదోడు వాదోడుగా ఉంటాను...."

ఆ సంభాషణ గుర్తొచ్చి తనలోతనే చిన్నగా నవ్వుకుంది సుమతి....

....ఒకడికి వాడి పేరుకు అర్థమే తెలీదు.... మరొకడికి తన శృంగారం తప్ప ఆ శృంగారం పేరుతో తను చేసేది రాక్షసకృత్యం అని తెలీదు.... ఇంక మూడోవాడు.... వాడు రచయితే కాదు, మంచినటుడుకూడా! అయినా వాడేమిటో వాడికే తెలీదు.... నన్ను నమ్మించాడు, పాపం అచ్చయ్యిందే నిజమని నమ్మే కొందరు పాఠకుల్ని నమ్మిస్తున్నాడు.... పైగా బ్రహ్మచారిట, పెళ్ళైనా భార్యతో ఎన్ని అబద్ధాలు చెప్తాడో ? అభ్యుదయ భావాలుగల అమ్మాయి కావాలిట.... నిజంగా అలాంటి అమ్మాయే వాడికి భార్యగావస్తే వాడి బ్రతుకును బజారుకీడ్చక మానదు !

ఇలాంటి వాళ్ళే సాహిత్యానికి చీడపురుగులు ! నాకంటే హీనాతిహీనులు ! వాళ్ళ గురించితెలిస్తే నిజమైన రచయితలు ఎంతసిగ్గు పడతారో. ఎంత బాధపడతారో కదా ?....

అలా.... తనలో తనే ఏవేవో అనుకొని చేతిలో ఉన్న పుస్తకాన్ని దూరంగా విసిరేసింది సుమతి ! •

